క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 15న హనుమకొండలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కలెక్టరేట్, నక్కలగుట్ట, మచిలీబజార్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు, గోపాల్‌పూర్, పెద్దమ్మగడ్డ, యాదవనగర్, మడికొండ టెక్స్‌టైల్స్ పార్కు సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని ఏనుమాముల, పోచమ్మమైదాన్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ శంకేశి మల్లికార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు.

హసన్‌పర్తి: మరమ్మతుల కారణంగా చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కేసీ క్యాంపు, రామారం, భీమారం, కోమటిపల్లి, భద్రకాళినగర్, చింతగట్టు, ఎర్రగట్టు గుట్ట, కిట్స్ ఏరియా, హసన్‌పర్తి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రేపటి నుంచి యోగా శిక్షణ శిబిరం

హన్మకొండ అర్బన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 16 నుంచి హరిత యోగా శిబిరం ఆధ్వర్యంలో హనుమకొండలోని ఏషియన్ శ్రీదేవి మాల్‌లో యోగా శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు యోగా గురువు పోశాల శ్రీనివాస్ తెలిపారు. నెల రోజుల పాటు నిర్వహించనున్న యోగా తరగతులు ప్రతిరోజు ఉదయం 6గంటల నుంచి 7 గంటల వరకు జరుగుతాయని వివరించారు. 15ఏళ్లు నిండిన వారు శిక్షణ తరగతులకు హాజరుకావొచ్చని పేర్కొన్నారు. వివరాలకు 93947 66001 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

'మల్లికాంబ'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హన్మకొండ అర్బన్: 2024 – 25 విద్యా సంవత్సరానికి ఉచిత ప్రత్యేక శిక్షణకు జిల్లాలోని మానసిక దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకురాలు బండ రామలీల ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రం గత 23 ఏళ్లుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అనేక మంది మానసిక దివ్యాంగులకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, బిహేవియర్ మోడిఫికేషన్ వంటి శిక్షణ అందించి మార్పు తీసుకువచ్చినట్లు వివరించారు. మానసిక దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక విద్యతో పాటు రవాణా సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు ఆటిజం, డౌన్ సిండ్రోమ్ మానసిక దివ్యాంగతను కలిగి ఉండి, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఫొటోలతో కేంద్రంలోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95022 52206, 80744 65703 నంబర్లలో సంప్రదించాలని రామలీల కోరారు.

ప్రజాసేవా అవార్డు ప్రదానం

కేయూ క్యాంపస్ / హసన్‌పర్తి: ఉత్తమ ప్రజాసేవా అవార్డును కాకతీయ యూనివర్సిటీ వాకర్స్ సంఘం సభ్యుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధి దేశిని లక్ష్మీనారాయణ అందుకున్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రాజ్‌భవన్‌లోని సంస్కృతిభవన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ రాధాకృష్ణన్, రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రెడ్ క్రాస్ చైర్మన్ అజయ్ మిశ్రా, వైస్ చైర్మన్ బుర్ర వెంకటేశం నుంచి అవార్డు స్వీకరించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ క్రిస్టియానా, వరంగల్ రెడ్ క్రాస్ ప్రతినిధి ఈవీ.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

అన్యాయంగా తొలగించారు

హన్మకొండ చౌరస్తా: 'కొంతమంది వారి స్వార్థానికి, వారి అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి మా ఉద్యోగాలను అన్యాయంగా తొలగించారు' అని మెప్మాలో కమ్యూనిటీ ఆర్గనైజర్లుగా పనిచేస్తున్న ఎస్.సునీత, ఎస్.సుజాత, జి.రమాదేవి, ఏ.రమ ఆవేదన వ్యక్తం చేశారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాదవ్ కళాప్రాంగణంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. కుంభకోణం చేశామని ఆరోపిస్తూ ఎలాంటి ఆధారాలు లేకుండా మెప్మా పీడీ కృష్ణవేణి తమను ఉద్యోగం నుంచి తొలగించారని వాపోయారు. తాము అక్రమాలకు పాల్పడినట్లు తేలితే ఏ శిక్షకైనా సిద్ధమే అని అన్నారు. మెప్మాలోని రజితారాణి, టీఎంసీ రమేష్, శ్రీనివాస్, హఫీజ్, నాగరాణి కలిసి వేరే వారికి ఉద్యోగాలు ఇప్పించడం కోసం లంచాలు తీసుకుని తమను ఉద్యోగం నుంచి తొలగించారని ఆరోపించారు.

నృత్యోత్సవంలో ప్రతిభ

కాజీపేట: ఒడిశాలోని పూరి జగన్నాథ దేవాలయం ఆవరణలో జరిగిన అఖిల భారత నృత్యోత్సవంలో కాజీపేట మండలం సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థులు రాణించారు. డ్యాన్స్‌లో పాఠశాలకు చెందిన అక్షితారెడ్డి గ్రూప్ మొదటి బహుమతి, డ్యూయట్ డ్యాన్స్‌లో నిగేషిత ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారు. ఈమేరకు ఆ విద్యార్థులను తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్లు తాళ్ల వంశీ, చైతన్య అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాలి



అక్షరాభ్యాసం చేయిస్తున్న కార్పొరేటర్, ఉపాధ్యాయులు



వరంగల్: శంభునిపేట పాఠశాలలో..



కాశిబుగ్గ: బీరువా అందజేస్తున్న రవిబాబు

ఖిలా వరంగల్: ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్లి రవి గుర్తుచేశారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమంలో భాగంగా కరీమాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం రేఖ అధ్యక్షతన అక్షరాభ్యాస కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవమైన ఉపాధ్యాయులు ఉంటారని, తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో చక్కటి విద్యా బోధన ఉంటుందని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపించి తల్లిదండ్రులు అప్పుల పాలు కావొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి, వీరాచారి, రఘు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, చక్రపాణి, వీరేంద్రప్రసాద్, శారదాదేవి, రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

శంభునిపేట స్కూల్‌లో సామూహిక అక్షరాభ్యాసం

వరంగల్: బడిబాట కార్యక్రమంలో భాగంగా నగరంలోని శంభునిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సోల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్ శారదాబాయి, ఏఏపీసీ చైర్ పర్సన్ మీనమ్మ, ఉపాధ్యాయులు వెంకటేష్, ప్రవీణ్‌కుమార్, సునీల్‌కుమార్, రాజు, పవిత్ర, మమత, సరిత, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 35వ డివిజన్ శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ.8 వేల విలువ గల ఇనుప బీరువాను రిటైర్డ్ హిందీ టీచర్ సీహెచ్.శ్రీనివాసాచార్యులు బహూకరించారు. ఆయన కుమారుడు రవిబాబు బీరువాను పాఠశాలకు తీసుకువచ్చి పాఠశాల ఉపాధ్యాయుల సమక్షంలో హెచ్ఎం శ్రీధర్‌కు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ తమ పాఠశాలలో పనిచేసి రిటైర్డ్ అయిన ఉపాధ్యాయుడు శ్రీనివాసాచార్యులు బీరువా అందజేయడం సంతోషంగా ఉందన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న అజర ఆస్పత్రి సిబ్బంది

హసన్‌పర్తి: రక్తదానం ప్రాణదానంతో సమానమని మాంటిస్సోరి విద్యాసంస్థల అధ్యక్షుడు గంద్ర సుధాకర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఎల్లాపురంలోని పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి మూడు నెలకొకసారి రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్మన్ జోస్, డైరెక్టర్ వర్గీస్, శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపాల్ జ్యోతి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలకు సన్మానం

వరంగల్ క్రైం: సీనియర్ జర్నలిస్ట్ అర్షం రాజ్‌కుమార్‌ను హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ శుక్రవారం సన్మానించారు. ఇప్పటి వరకు 18సార్లు రక్తదానం చేసిన రాజ్‌కుమార్‌ను ప్రపంచ రక్తదాత దినోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ సన్మానించి మెమొంటో అందజేసి అభినందలు తెలిపారు.

ఖిలా వరంగల్: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వరంగల్ రంగశాయిపేటకు చెందిన రక్తదాతలు కొండ్రెడ్డి నవీన్ కుమార్ రెడ్డి, కనకయ్యకు కలెక్టర్ సిక్తా పట్నాయక్ మెమెంటోలు అందజేసి సన్మానించారు.

అజర ఆస్పత్రిలో రక్తదానం

ఎంజీఎం: వరల్డ్ బ్లడ్ డోనర్స్ డే సందర్భంగా నగరంలోని మదర్ వాలంటరీ బ్లడ్ సెంటర్‌లో అజరా ఆస్పత్రి సిబ్బంది శుక్రవారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని సూచించారు.

క్రీడలతో మానసికోల్లాసం



నాకౌట్ మ్యాచ్‌లో గెలిచిన సాక్షి డెస్క్ జట్టు



క్యారమ్ ఆడుతున్న వినయ్‌భాస్కర్

నయీంనగర్: నిత్యం ఉరుకులు, పరుగులతో విధులు నిర్వహించే జర్నలిస్టులకు క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని, శారీరక దృఢత్వానికి ఆటలు ఎంతో దోహదపడుతాయని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్ -2024లో భాగంగా ప్రెస్ క్లబ్‌లో రెండవ రోజు క్యారం, చెస్ పోటీలను వినయ్‌భాస్కర్ శుక్రవారం ప్రారంభించారు. అలాగే, ఆర్ట్స్ కళాశాల మైదానంలో క్రికెట్ పోటీలను కాజీపేట ఏసీపీ తిరుమల్ ప్రారంభించారు. ఆయనకు క్రీడాకారులను ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య పరిచయం చేశారు. అనంతరం జరిగిన మ్యాచ్‌లో ఈస్ట్ డ్రాగన్స్ టీంపై సాక్షి డెస్క్ టీం విజయం సాధించింది. యంగ్ ఎలక్ట్రానిక్స్ వర్సెస్ ఈస్ట్ రాకర్స్ మ్యాచ్ ఆడగా యంగ్ ఎలక్ట్రానిక్స్ గెలిసింది. హనుమకొండ కింగ్స్‌తో ప్రాణహిత జట్టు తలపడగా హనుమకొండ కింగ్స్‌ను విజయం వరించింది. లగాన్ టీమ్, నమస్తే తెలంగాణ డెస్క్ జట్లు ఆడగా లగాన్ టీమ్ విజయం సాధించింది. ప్రెస్ క్లబ్ కోశాధికారి బోళ్ల అమర్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

అభాగ్యులకు ఆశ్రయం



దేశాయిపేట: నా అనే వాళ్లు లేని అభాగ్యులను ఓ కార్పొరేటర్ అక్కున చేర్చుకుని ఆపన్న హస్తం అందించి ఆదుకున్న సంఘటన 13వ డివిజన్‌లో చోటు చేసుకుంది. రంజిత్ కుమార్, అతని సోదరి మతిస్థిమితం సరిగా లేని రమాదేవికి కార్పొరేటర్ సురేష్‌కుమార్ జోషి తన సొంత ఖర్చులతో గుడిసె వేయించారు. అలాగే అన్ని విధాలా సహాయం చేస్తానని అక్కాతమ్ముళ్లకు హామీ ఇచ్చారు.

సమస్యలపై దృష్టి సారించండి



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

వరంగల్ అర్బన్: డివిజన్లలో కొన్ని నెలలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై దృష్టి సారించాలని బీఆర్ఎస్ కార్పొరేటర్లు కోరారు. ఈమేరకు గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను బల్దియా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. స్మార్ట్‌సిటీ, జనరల్ ఫండ్, సీఎం ప్రత్యేక నిధులతో చేపట్టిన పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయని, ఆ పనులను వెంటనే మొదలు పెట్టాలని సూచించారు. డివిజన్లలో క్షేత్రస్థాయిలో పర్యటించి, ఆయా విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మరుపల్లి రవి, దిడ్డి కుమారస్వామి, పల్లం పద్మ, బోగి సువర్ణ, బస్వరాజు శిరీషా ఉన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించండి

హసన్‌పర్తి: 55వ డివిజన్‌లో మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కార్పొరేటర్ జక్కుల రజిత కోరారు. ఈమేరకు కమిషనర్ అశ్విని తానాజీ వాకాడేను శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా పనులు ఇంకా ప్రారంభం కాలేదని, భీమారం, కోమటిపల్లిలో శ్మశాన వాటికకు నిధులు విడుదలైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏఐపీకేఎస్ నాయకులు

కాశోజీ సెంటర్: రైతులకు 50 శాతం సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) రాష్ట్ర నాయకుడు చిర్ర సూరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి మాట నిలుపుకోలేనదన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతులకు రుణాలు మాఫీ కాలేదని, కొత్త రుణాలు లభించక వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువులు, వ్యవసాయ పరికరాల ధరలు పెరగడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. పాడి రైతులకు 50 శాతం సబ్సిడీతో పశువులను అందించాలని, కౌలు రైతులకు కూడా అన్ని ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని సూచించారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు అర్షం అశోక్, ధార లింగయ్య, మైదం పాణి, పైడి, రవి, మోహన్, సతీశ్, అంకూస్, శివ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

అపార్ట్‌మెంట్ నిర్మాణాన్ని నిలిపివేయాలి

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ 10వ డివిజన్‌లోని పద్మాక్షికాలనీలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అపార్ట్‌మెంట్ పనులను తక్షణమే నిలిపివేయాలని స్థానిక కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు కోరారు. స్థానికుల ఫిర్యాదు మేరకు నిర్మాణంలో ఉన్న ఏవీకేవీ అపార్ట్‌మెంట్‌ను ఆయన శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణానికి అధికారులు అనుమతులు ఇవ్వడం సరికాదని, రోడ్డు, డ్రెయినేజీలాంటి వసతులు లేకుండానే నిర్మిస్తున్నారని అన్నారు. అపార్ట్‌మెంట్ పూర్తయితే అందులో పది కుటుంబాలు నివాసం ఉంటే భవనంలోని వ్యర్థ జలాలు రోడ్డుపైకి వచ్చి చేరుతాయని వాపోయారు. ఈ విషయాన్ని అపార్ట్‌మెంట్ యజమానికి స్థానిక శ్రీరామకాలనీ వాసులు తెలియజేయగా ఆయన దురుసుగా స్పందించాడని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుమార్‌యాదవ్, శ్రీరామ కాలనీవాసులు కోడెం రామ్మూర్తి, కోల సురేందర్, మాడిశెట్టి కుమారస్వామి, పర్చా కిరణ్, సూరం సమ్మయ్య, గోపి, తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య, భోజనం అందించాలి

విద్యారణ్యపురి: జిల్లాలోని గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెనూ ప్రకారం రుచికమైన శుభ్రమైన భోజనం అందించాలని ఏబీఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలో సాంఘిక సంక్షేమ గురుకులాల ఆర్‌సీఓ విద్యారాణిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గురుకులాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, నాయకులు ధార సురేష్, భరత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

ఖిలా వరంగల్: విద్యుత్ స్తంభాన్ని ఓ లారీ ఢీకొట్టడంతో ఆ స్తంభం విరిగి ముక్కలైంది. ఈక్రమంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్నాయి. ఈ ఘటన గురువారం రాత్రి వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై నాయుడు పెట్రోల్‌బంక్ సమీపంలోని బెస్తం చెరువు వద్ద జరిగింది. ఖమ్మం నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ మద్యం మత్తులో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

టెస్కాబ్ చైర్మన్‌కు సన్మానం

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్‌గా ఎన్నికైన మార్నేని రవీందర్‌రావును వరంగల్ డీసీసీబీ ఉద్యోగులు సన్మానించారు. హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రవీందర్‌ను డీసీసీబీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరంగల్ యూనిట్ ముఖ్య సలహాదారుడు కృష్ణమోహన్, వరంగల్ యూనిట్ అధ్యక్షురాలు రజిత, ప్రధాన కార్యదర్శి నాగరాజు, సీఈఓ ఎండీ వజీర్ సుల్తాన్, జనరల్ మేనేజర్ ఉషశ్రీ అభినందించారు.

మాజీ మేయర్‌ను కలిసిన మార్నేని దంపతులు

వరంగల్: వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, వరద రాజేశ్వర్‌రావు దంపతులను టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఐనవోలు ఎంపీపీ మధుమతి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా టెస్కాబ్ చైర్మన్‌గా ఎన్నికైన రవీందర్ రావును స్వర్ణ, రాజేశ్వర్‌రావు అభినందించారు.

కేయూ హాస్టళ్ల డైరెక్టర్‌కు సన్మానం

కేయూ క్యాంపస్: కేయూ హాస్టళ్ల డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్‌ను ఎస్‌డీఎల్‌సీఈ సైన్స్‌కోర్సుల అసిస్టెంట్ డైరెక్టర్ మైక్రో బయాలజీ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటగోపీనాథ్ సన్మానించారు.

ముజీబ్‌కు టీఎన్జీఓస్ నాయకుల అభినందనలు

హన్మకొండ అర్బన్: టీఎన్జీఓస్ యూనియన్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ముజీబ్, కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌ను హైదరాబాద్ నాంపల్లిలోని టీఎన్జీఓస్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ అధ్వర్యంలో టీఎన్జీవోస్ బాధ్యులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘం నాయకులు శ్యాంసుందర్, కత్తి రమేష్, సారంగపాణి, మొయిజ్, లక్ష్మీప్రసాద్, జిల్లా నాయకులు ఆకుల రాజమౌళి, రాంప్రసాద్, రాజీవ్, అనూప్, పైడి రాజు, ప్రణయ్, పృథ్వీ, రామాంజనేయులు, నవీన్, సుధాకర్, మెహబూబ్, మిస్బా పాల్గొన్నారు.

నియామకం

వరంగల్: జాతీయ కాంగ్రెస్ వర్కర్స్ కమిటీ వరంగల్ జిల్లా కార్యదర్శిగా నగరంలోని 14వ డివిజన్ ఏనుమాములకు చెందిన కోగిల సుధాకర్ నియమితులయ్యారు. ఈమేరకు సుధాకర్‌కు తెలంగాణ రాష్ట్ర వర్కర్స్ ప్రెసిడెంట్ సయ్యద్ షబ్బీర్ అలీ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

సీడబ్ల్యూసీ సభ్యుడిని కలిసిన కాంగ్రెస్ శ్రేణులు

హసన్‌పర్తి: సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచందర్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని జరిగిన ఓ కార్యక్రమానికి వంశీచందర్ రెడ్డి హాజరు కాగా, ఆయనను ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి నాగగోని కుమార్, నాయకులు డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆవుల పవన్‌కల్యాణ్, బుచ్చిరెడ్డి కలిశారు.

వేం పురుషోత్తంరెడ్డి సేవలు మరువలేనివి

హన్మకొండ అర్బన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సోదరుడు వేం పురుషోత్తంరెడ్డి సేవలు ఎనలేనివని తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి కొనియాడారు. పురుషోత్తంరెడ్డి మొదటి వర్ధంతి సందర్భంగా సంఘం నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రావుల నరసింహారెడ్డి, నంద్యాల కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, యాకూబ్‌రెడ్డి పాల్గొన్నారు.

సమ్మె విరమించిన హమాలీ కార్మికులు

హన్మకొండ: తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి కొన్ని రోజులుగా చేస్తున్న సమ్మెను హమాలీలు విరమించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఐరన్, సిమెంట్ అండ్ హార్డ్‌వేర్ షాపు యజమానులు, హమాలీలతో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ శుక్రవారం జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా హమాలీలకు కూలీ రేట్ల పెంపు, గతంలో బస్తాకు కూలి రూ.6 ఉండగా అది ఇప్పుడు రూ.8కి పెంచేందుకు దుకాణ యజమానులు అంగీకరించారు. కార్యక్రమంలో సిమెంట్, ఐరన్ అండ్ హార్డ్‌వేర్ షాపు యజమానులు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎంజాల మల్లేశం, ట్రేడ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కొమురయ్య, ఉపాధ్యక్షుడు గొంగళ్ల వెంకన్న, కార్యదర్శి సన్నబోయిన రవి, కార్యవర్గ సభ్యులు మల్లేష్, రామ్మూర్తి, కుమారస్వామి, రాములు, కొండయ్య, యాకయ్య, అంజయ్య, రాజు, దేవేందర్ పాల్గొన్నారు.

జంతు వధలో నిబంధనలు పాటించాలి



కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ శివకుమార్

రామన్నపేట: జంతు వధలో నిబంధనలు పాటించాలని ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న కటిక వాళ్లకు (జంతు వధ చేసే వాళ్లు) పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెటర్నరీ అధికారి అనుమతి ఉన్న పశువులను మాత్రమే వధించాలని, వైద్యుడి సర్టిఫికెట్ ఉన్నప్పటికీ ప్రభుత్వ అనుమతి ఉన్న కబేళాల్లోనే వధించాలని సూచించారు. రోడ్లపై, ఇళ్లలో పశువులను వధించడం, మాంసాన్ని విక్రయించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. శాంతియుత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ అన్నారు.

లక్ష గరికలతో అలంకరణ



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో లక్ష గరిక పూజలను అర్చకులు శుక్రవారం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐనవోలు వెంకటేశ్వర్లు శర్మ పర్యవేక్షణలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తెచ్చిన గరికలతో శ్వేతార్కుడిని అర్చకులు అభిషేకించారు. సహస్ర పుట్నాలతో తయారైన బెల్లం లడ్డూలతో తయారు చేసిన నైవేద్యం సమర్పించారు. స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, రమ దంపతులతో పాటు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

చే గువేరా జీవితం స్ఫూర్తిదాయకం



ఖిలా వరంగల్: చే గువేరా జీవితం స్ఫూర్తిదాయకమని ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ల్యాదల్ల శరత్ అన్నారు. వరంగల్ శివనగర్‌లోని ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో ఉద్యమ నేత చేగువేరా 96వ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చే గువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శరత్ మాట్లాడుతూ అర్జెంటీనాలో జన్మించిన చే గువేరా.. వైద్య, ఇంజనీరింగ్ విద్యలను అభ్యసించి ఆనాడు లాటిన్ అమెరికా సామ్రాజ్యవాదం చేస్తున్న దుశ్చర్యలకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన మహనీయుడని కొనియాడారు. చే గువేరా ఉద్యమ పోరాట పటిమకు భయపడిన అమెరికా సామ్రాజ్యవాదులు.. ఆయనను 1967 అక్టోబర్ 9న చంపారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాటం శివకుమార్, సంతోష్, మేకల అభిరామ్, ప్రభాస్, రాజు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిధులతో కాజీపేటను అభివృద్ధి చేయాలి

కాజీపేట రూరల్: కేంద్రం నిధులతో కాజీపేటను అభివృద్ధి చేయాలని కాజీపేట 47వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈమేరకు వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని వారి స్వగృహంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన చట్టంలో మంజూరైన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు, కాజీపేట డివిజన్ ఏర్పాటయ్యే విధంగా చూడాలని కోరారు.

ఎంపీ కావ్యను కలిసిన టీజీఓ నాయకులు

హన్మకొండ అర్బన్: వరంగల్ ఎంపీ కడియం కావ్యను తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు అమ్జద్ అలీ, ప్రవీణ్‌కుమార్, ఫణికుమార్, కిరణ్‌కుమార్, అస్నాల శ్రీనివాస్, హరిప్రసాద్, రాజేష్‌కుమార్, మాధవరెడ్డి, రాజేష్‌కుమార్, నాగనారాయణ, అజహర్ షరీఫ్, మధురిమ, బాలునాయక్, రమేష్‌కుమార్ రెడ్డి, హాలునాయక్ పాల్గొన్నారు.

కార్మికులు గుర్తింపు కార్డు పొందాలి



హన్మకొండ చౌరస్తా: భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు కార్మికశాఖ ద్వారా గుర్తింపు కార్డును కలిగి ఉండాలని, అప్పుడే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రమేష్‌బాబు సూచించారు. హనుమకొండలోని సుధానగర్‌కు చెందిన కార్మికుడు మామిడాల శివయ్య గతేడాది డిసెంబర్‌లో సహజ మరణం పొందగా, కార్మిక శాఖ ద్వారా సహజ మరణం, దహన సంస్కారాల నిమిత్తం రూ.15వేల విలువగల చెక్కును కలెక్టరేట్‌లోని కార్మికశాఖ కార్యాలయంలో మృతుడి భార్య శారదకు శుక్రవారం అందజేశారు. అలాగే, వివాహ కానుక పథకం ద్వారా రూ.10 వేల చొప్పున ఇద్దరికి చెక్కులు, నిర్మాణ రంగ కార్మికుల పిల్లలకు 18 మందికి ఉపకార వేతనాలు అందజేశారు.